# హింస

"మనుషులు హింస పడకుండావుండాలేరా ఏమిటనిపిస్తోంది చూస్తుంటే - ఇదంతా పెద్ద వలయంలా వుంది. అధికారం సంపాదించుకోడానికి హింస జరపాలి. కానీ నిరంతరం హింస జరుపుతూ వుండడం ద్వారా మాత్రమే అధికారాన్ని నిలుపుకోవడం అసాధ్యం. తేలిక మార్గం ఏమిటంటే హింసకూ, అధికారానికీ అందరి ఆమోదాన్ని సంపాదించడం. తాము హింస అనుభవించడం తప్పదనీ, అదే సహజమనీ, న్యాయమనీ, సమాజానికి అవసరమనీ జనం నమ్మితే యిక అధికారం చలాయించే వాళ్ళకు అదెంత సుఖమో ఆలోచించు. ఎవరికి వారు హింసను స్వయంగా అనుభవిస్తారు. తమని తామే హింస పెట్టుకుంటారు. అసలది హింసని అనుకోనే అనుకోరు. ఇన్నాళ్ళు పురుషాధిపత్యం తన అధికారాన్ని ఇట్లాగే నిలబెట్టుకుంది. ఏమంటావు?"

గంటనుంచీ చల్లని - వెన్నెలను కూడా లెక్కచేయకుండా బుర్ర వేడెక్కించుకుని ఆలోచించి కనుక్కున్న సత్యాన్ని అర్జంటుగా తన అక్క వాణికి బోధించాలని చూసింది సుమ.

"అసలే నా బుర్ర చెడిపోయి వుంది ఇంకా చెడగొట్టకు"

వాణీ మనసు బాగోనపుడు సుమలాగ బుర్రను వేడెక్కించుకోదు. ఏదో ఒక పని చేసి ఆ సంగతి మర్చిపోవాలని చూస్తుంది. ఇప్పుడుకూడా చిందరవందరగా వున్న తన గదిని సర్దుకునే పని పెట్టుకుంది. గంటకుపైగా చెమటోడిస్తే గది ఓ కొలిక్కి వచ్చింది. సాయంత్రం నుంచీ తనను బాధ పెట్టిన విషయం కాస్త వెనక్కు వెళ్ళిందనుకుంటే సుమ దాన్ని మళ్ళీ కెలుకుతోంది.

"నీ బుర్ర నేను చెడగొట్టడం లేదు. పదును పెడుతున్నాను. నువ్వు ఎప్పటి సమస్యకు అప్పుడు బాధపడి కడివెడు కన్నీళ్ళు కార్చి వూరుకుంటావు". అక్కను రెచ్చగొట్టయినా సరే తన మనసులో మథనమంతా అర్థం చేయించాలనే పట్టుదల సుమది.

"బుర్ర బద్దలు కొట్టుకొని ఏం సాధిస్తావేం చెప్పు"?

"సాధించగలం - ఇప్పుడీ సమస్య గురించి నువ్వు బుర్ర బద్దలు కొట్టుకున్నావనుకో ఆ సుగుణకు ఏమన్నా సహాయం చేయగలుగుతావు".

"ఏం సహాయం? ఒక వైపు ఆ అమ్మాయి చిత్రహింస పడుతుంటే అధికారం, హింస, ఆమోదం, పురుషాధిపత్యం, ఈ మాటలు చెప్పి ఆమెకు పిచ్చికూడా ఎక్కించనా?" నిజంగానే చిరాకేసింది వాణీకి.

"నన్నడిగితే ఈ చిత్రహింస తెలియకుండా ఆమెకు పిచ్చెక్కినా మంచిదే. కానీ

నేను ఈ మాటలన్నీ ఆ పిల్లతో చెప్పమనటంలేదు. నువ్వు అర్థం చేసుకుని ఆ పిల్లకు సహాయం చేయమంటున్నాను." సుమ బతిమాలుతున్నట్టుగా అంది.

"ఏం చెయ్యను? నేను చేస్తానన్న సహాయం ఆమె తీసుకోవడం లేదే."

"బలవంతంగా చెయ్యి. ఒకతప్పుడు అధికారాన్ని చలాయించడానికి వాళ్ళు ఎంత బలవంతమైనా చేస్తారు గదా! ఒక మనిషిని రక్షించడానికి మనం కాస్త బలవంతం చేస్తే ఏమవుతుంది." ఎట్లాగయినా వాణీని ఒప్పించాలని సుమ ప్రయత్నం.

"బలవంతమేమిటి - బ్రతిమాలి చెప్పాను. నీ ప్రాణాలకే ముప్పు. అన్యాయంగా చచ్చిపోతావని చెప్పాను. ఐనా ఆ అమ్మాయి ఒప్పుకోదే." నిస్సహాయంగా అంది వాణి.

"అసలు నువ్వేం చేస్తావో ఆ అమ్మాయికి చెప్పకు. చెయ్యదల్చుకుంది చేసెయ్యి."

సుమకు అధికారం ఉంటే వాణిని లాక్కెళ్ళి ఆ పనేదో చేసేటట్లే వుంది.

"బాగుంది - వాళ్ల అంగీకారం లేకుండా నేనా పని చేస్తే రేపు వాళ్ళ వాళ్ళంతా వచ్చి నా మీద పడతారు. కోర్టుకీడుస్తారు."

"అది సహజంగా జరిగినట్లు అనిపించేలా చెయ్యలేవా? చాలా పద్ధతులుంటాయి గదా - ఒకవేళ కోర్టులో కేసు పెడితే ఆ పిల్ల ప్రాణం కాపాడ్డం కోసం అబార్షన్ చెయ్యక తప్పలేదని వాదిద్దాం." సుమ లాయర్‌గా కూడా ఉత్సాహం తెచ్చుకుంది.

"ఓహో - నీ ప్రాక్టీసు నా ద్వారా పెంచుకుందామని చూస్తున్నావా తల్లీ. దయచేసి నన్నొదిలెయ్". తమాషాగా చేతులెత్తి దణ్ణం పెట్టబోయి సుమ ముఖం చూసి ఆ పని చేయలేక ఆ చేతుల్ని చెల్లెలి భుజాల మీద వేసింది ప్రేమగా. సుమ ఆ ప్రేమను పట్టించుకోకుండా ఆ చేతుల్ని విదిలించేసింది.

"డోంట్ జోక్ - సుగుణను తల్చుకుంటే - నిన్న నేను చూసిన దృశ్యం గుర్తొస్తే - నారక్తం ఉడికిపోతోంది. ఒక ఆడది అంత హింస పడాల్సిందేనా? పదివేల మందిలో ఒకతి కాదు ప్రపంచంలో ఒకతైనా సరే తాను ఆడదైనందువల్ల హింస పడాల్సి వస్తే నారక్తం మరిగిపోతుంది. ఎవరి శాసనం ఇది? ఆ శాసనానికి ఎదురు తిరగాలనిపించకపోతే నువ్వు మనిషివి కాదన్నమాట." సుమ రక్తం నిజంగానే మరిగిపోతోంది.

"ఎదురు తిరగాల్సింది సుగుణ" శాంతంగా స్థిరంగా చెప్పింది వాణి.

"ఔను - నిజమే - సుగుణే - నేనూ అదే చెప్తున్నాను. సుగుణలాంటి లక్షల మంది ఆడవాళ్ళకు తాము ఏవో శాసనాలకు లోబడి వున్నామని తెలియదు. హిట్లర్‌ను మించిన నియంతల చేతుల్లో తమ జీవితాలు చిక్కుకుని వున్నాయనీ, తమ మీద భయంకరమైన ఫాసిజం అమలవుతోందని ఆడవాళ్ళకు తెలియదు. అదంతా తమ పవిత్ర కర్తవ్యం, సహజ

ధర్మం అని నమ్ముతారు. ఆమోదిస్తారు. అంగీకరిస్తారు. ఆ అంగీకారమే పురుషులకు అధికారాన్ని యిస్తోంది. దాన్నుంచి సుగుణలను రక్షించడం ఎట్లా? అంగీకారాన్నీ, ఆమోదాన్నీ తుడిచిపెట్టి అనంగీకారాన్నీ, తిరుగుబాటునీ రెచ్చగొట్టడం ఎట్లా? కొన్ని టెర్రరిస్టు చర్యలు చేయాలి. నువ్వో టెర్రరిస్టువనుకో - ఆ దీనురాలికోసం ఓ సాహసం చెయ్యి. నీకు తోడు నేనున్నాను. ఇద్దరం ఈ తిరుగుబాటు చేసి అవసరమైతే వీరమరణం పొందుదాం."

సుమ మాటల్లో నిజాయితీ తప్ప మరింకో భావం లేదు. ఆమె అట్లా తప్ప మాట్లాడలేదు. అది తెలిసిన వాణీ కూడా సుగుణ విషయంలో ఏం చెయ్యాలా అని ఆలోచిస్తోంది.

* * * * *

సుగుణతో డాక్టర్ వాణీకి రెండేళ్ళనుంచీ పరిచయం. వాణీ ఈ చిన్న టౌన్లో గవర్నమెంట్ ఆస్పత్రిలో డాక్టర్‌గా చేరినప్పటినుండీ సుగుణ వస్తూనే వుంది. వాణీ డ్యూటీలో చేరిన రెండు నెలలకేమో సుగుణ మొదటిసారి బిక్కుబిక్కు మంటూ హాస్పిటల్‌కు వచ్చింది.

ఆ అమ్మాయిని చూడగానే వాణీకి ఆమె యింతకు ముందెన్నడూ హాస్పిటల్‌కు రాలేదని, పరీక్షలు చేయించుకోలేదని అర్థమయింది.

'బాధేమిట'ని వాణీ అడిగితే - సిగ్గుపడుతూ సిగ్గుపడుతూ 'పెళ్ళయి రెండేళ్ళయినా పిల్లలు పుట్టలేదని' చెప్పింది.

"రెండేళ్ళే గదా - తొందరేముంది? అసలు నీకెన్నేళ్ళు" అని వాణీ అడిగితే "పద్దెనిమిదేళ్ళ"ని జవాబిచ్చింది.

"ఇంకా మూడేళ్ళు ఆగాలి నువ్వు. ఇంత చిన్న వయసులో పిల్లల్ని కనకూడదు" అని వాణీ నచ్చచెబితే చాలా అమాయకంగా "మా అత్త తిడతంది" అంది.

"ఏమంటది మీ అత్త" ఏమంటుందో వాణీకి తెలిసినా సుగుణకు తనంటే భయం పోగొట్టాలని మాటలు పెంచింది.

"ఎన్ని సంబంధాలో చూసి, ఎన్ని సంబంధాలో ఒద్దనుకుని నా బిడ్డను గొడ్డుమోతు దానికిచ్చి చేసానంటంది. ఇంకా యేదేదో తిడతానే వుంటది".

ఆ పిల్ల చెప్తున్న తీరుకు వాణీకి నవ్వూ, జాలీ ఒకేసారి వచ్చాయి.

"సరే పద పరీక్ష చేస్తా"నని వెనుక వున్న బల్ల మీద పడుకోమంది.

సుగుణ బల్లెక్కుతుంటే కాళ్ళు ఒణకడం కనిపించి నవ్వింది వాణి.

"నేను రాక్షసిలా ఉన్నానా అంత భయపడుతున్నావు"? చేతికి గ్లోవ్స్ తొడుక్కుంటూ అంది.

నర్సు సుగుణ లంగా ఒదులు చేయమనీ, కాళ్ళు ఎడంగా పెట్టమనీ అంటుంటే సుగుణ కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

ఆ మాటలు సుగుణకెంత మొరటుగా విన్పిస్తున్నాయో వాణీ గ్రహించగలదు. మొదటిసారి డాక్టర్ పరీక్షకు వచ్చిన చాలామంది ఆడవాళ్ళు అలాగే ఫీలవడం వాణీ చూసింది. ఐతే అదే అలవాటై తనూ మొద్దుబారి పోకుండా వాళ్ళ భయం పోగొట్టే ప్రయత్నం చేస్తుంది వాణి.

సుగుణకు కూడా పరీక్ష చేసే పద్ధతి గురించి చెప్పి భయం పోగొట్టింది. శరీరం గురించి, గర్భాశయం గురించి, నాలుగైదు నిమిషాలు చెప్పింది.

ఆ క్షణం నుంచీ సుగుణకు వాణీ గురువైపోయింది.

బ్రహ్మజ్ఞానం బోధించిన ఆధ్యాత్మిక గురువును శిష్యులెంత ప్రేమిస్తారో తెలియదు గానీ తన శరీరాన్ని గురించి కొద్దిపాటి జ్ఞానాన్నిచ్చినందుకు డాక్టర్ వాణీని సుగుణ ఎంతగానో ప్రేమించింది.

వాణీ సుగుణలో ఎలాంటి లోపమూ లేదని చెప్పి ఈ సారి వచ్చేటప్పుడు వాళ్ళాయనతో కలిసి రమ్మని చెప్పింది.

కానీ తర్వాత నెల కూడా సుగుణ ఒక్కత్తే వచ్చింది.

"మీ ఆయనేడి? నేరమ్మన్నానని చెప్పలేదా" అని వాణీ అడిగితే

"చెప్పానండీ - ఇంకానయం అన్నాడు. ఆయన రాడు" అంది.

వాణీకి మగవాళ్ళనుంచి వచ్చే ఆ సమాధానం కొత్తకాదు. చాలామంది చదువుకున్నవాళ్ళే అట్లా వుంటారు. సుగుణ భర్త చదువుకోలేదు. అతన్ని రప్పించడం సులువు కాదు. సుగుణకు డి.ఎన్.సి. చేసింది. ఆ తర్వాత మూడు నెలలకు సుగుణ గర్భవతైంది. అత్తవారింట్లో అంతా సంతోషంగా ఉన్నారనీ, భర్త బాగా చూసుకుంటున్నాడని చెప్పింది. సుగుణ వచ్చేప్పుడల్లా వాణీకి పువ్వులు తెచ్చేది. సుగుణ భర్త తనకున్న ఆరెకరాల పొలంలో ఒక ఎకరం పూలతోట వేసాడు. ఆ తోటలోంచి గులాబీలు, కనకాంబరాలు తెచ్చి యిస్తుండేది. ఆ రకంగా వాణీతో ప్రత్యేకమైన స్నేహం చేస్తున్నాననుకునేది సుగుణ. ఆ రకంగా ఆరు నెలలు గడిచి పోయాయి. ఓ రోజు వచ్చిన సుగుణను చూడగానే ఏదో సమస్య వుందని అర్థమైంది వాణీకి.

ఆ రోజు సోమవారం. సోమవారం ఉదయం పది గంటలకు గవర్నమెంటు ఆసుపత్రిలో ఎంత రద్దీగా ఉండాలో అంత రద్దీగానూ వుంది. ముఖ్యంగా స్త్రీల (ఓ.పి.) దగ్గిర. ఆ రోజు గర్భిణీ స్త్రీలను చూసే రోజవడంతో రకరకాల సైజుల పొట్టలతో వచ్చిన ఆడవాళ్ళతో హాలు కిటకిటలాడిపోతోంది. ఎవరికి వారు తాము తొందరగా చూపించుకుని

వెళ్ళిపోదామనే హడావిడిలో వున్నారు. గుంపుగా మూగుతున్నారు. బరువు చూసే దగ్గర, బి.పి. చూసే దగ్గర - పరీక్ష చేసే టేబుల్ దగ్గరా వాళ్ళను ఒక వరుసలో నిలబెట్టడం నర్సులకు అసాధ్యంగా వుంది.

ఆడవాళ్ళు హడావుడి పడుతున్నారంటే ఎందుకుపడరు?

ఇంట్లో పనులు సగంలో వదలి వచ్చిన వాళ్ళున్నారు. ఇంటి దగ్గర చిన్న పిల్లల్ని వదలి వచ్చిన వాళ్ళున్నారు. ముసలి వాళ్ళు వీళ్ళకోసం ఎదురుచూస్తుంటారు. కొందరికి చంకల్లో ఏడాది, రెండేళ్ళ పిల్లలు! ఆ వుక్కకీ హడావుడికీ బేజారెత్తి రాగాలు పెడుతున్నారు. ఇంత ఒత్తిడిలో తోసుకోకుండా తమను డాక్టరు పిల్చే వరకు కూర్చునే ఓపిక ఎవరికుంటుందీ?

ఆ రోజే పి.హెచ్.సి.ల నుండి దాయీలు ట్రెయినింగు కోసం వచ్చారు. ఉన్న ముగ్గురు డాక్టర్లూ గర్భిణీ స్త్రీలను పరీక్ష చేస్తూ ఆ దాయీలకు ఏ నెలలో పొట్టలో పిండం ఎక్కడి వరకు పెరుగుతుందో లాంటి కొన్ని ప్రాధమిక విషయాలు చెప్తున్నారు. వాణీ ఈ పని చాలా శ్రద్ధగా చేస్తుంది. వాళ్ళకు చెప్పడంలో నిర్లక్ష్యం చూపిస్తే, వాళ్ళకు సరిగా అర్థం కాకపోతే వాళ్ళు పల్లెటూళ్ళలో ఆడవాళ్ళను ప్రమాదాలలో పడేస్తారని వాణీ భయం.

వాణీ దగ్గరకు వెళ్ళాలని సుగుణ ప్రయత్నించింది.

కానీ ఆమె పరీక్ష చేసే టేబిల్ చుట్టూ నలుగురు దాయీలు, యిద్దరు నర్సులూ, డాక్టరూ -వీళ్ళచుట్టూ తోసుకుంటున్న ఆడవాళ్ళూ అంతా వూపిరాడకుండా వుంది.

ఈ తోపులాటలోకి పోయే ఓపిక ఆరోజు సుగుణకు లేదు.

నిలబడే ఓపిక కూడా లేదు. ఓపిక లేకపోవడం కాదు. నిలబడడం అసాధ్యంగా వుంది. పొత్తికడుపు కిందా, తొడల దగ్గరా, నీరు చేరి విపరీతమైన బరువు, బాధా వాటికి తోడు ఎందుకిట్లా జరిగిందోనన్న కంగారు సుగుణను వేధిస్తున్నాయి.

ప్రతిక్షణం దుర్భరంగానే గడుస్తోంది.

ఇంత హడావుడిలోనూ వాణీ సుగుణను చూడనే చూసింది. ఆమె ముఖం చూడగానే ఏదో ప్రమాదం ముంచుకొచ్చిందని అర్థమైంది.

ఒక్క క్షణం అందర్నీ కేకలేసి వెనక్కు పంపించి సుగుణను రమ్మని పిలిచింది.

సుగుణ భారంగా కదలి వచ్చింది. నర్సుని బి.పి. ఆపరేటస్ తెమ్మని తనే స్వయంగా బి.పి. చూసింది. ఆ బి.పి. చూస్తే తన బి.పి. పెరిగినట్లనిపించింది.

"డాక్టరుగారూ - కింద ఒకటే బరువు - బాధ" - సుగుణకు అప్పటిదాకా మింగిన ఏడుపు వాణీని చూడగానే పైకి తన్నుకొచ్చింది.

"ఊరుకో - నే చూస్తున్నాగా" అని సముదాయిస్తూ ఆమె కాళ్ళు ఎడంగా జరిపి

కిందకి కొద్దిగా తల వంచిన వాణీకి తల తిరిగిపోయింది.

చాలా అరుదుగా జరిగే విషయం - వల్వల్ ఎడీమా! సుగుణ పొత్తికడుపు కిందంతా వాచిపోయి వుంది. యోని పెదాలు యింతలావున వాచి భయంకరంగా కన్పిస్తున్నాయి.

కొందరికి గర్భం రాగానే రక్తపోటు పెరుగుతుంది. ఒంటికి - ముఖ్యంగా యోని దగ్గరా, తొడల దగ్గరా నీరు చేరుతుంది. విపరీతమైన బాధ. సూది వేసి ఆ నీరు పిండివేయటం తప్ప మరో మార్గం వుండదు. అదొక చిత్రహింస.

అంత రక్తపోటు వున్నపుడు కడుపులో బిడ్డకు ఏ క్షణంలోనైనా అపాయం జరగవచ్చు. సామాన్యంగా ఇలాంటి కేసుల్లో బిడ్డ బతకదు. తల్లి ప్రాణానికే ముప్పువస్తుంది.

సుగుణకు ఈ పరిస్థితి వచ్చిందే అని దిగులు పడింది వాణి.

వెంటనే నీరు పిండెయ్యాలి. ఆలోచనల్ని వాయిదావేసి నర్సుతో సుగుణను డి.ఎన్.సి. లు చేసే థియేటర్‌కు తీసుకువెళ్ళమనీ, కావల్సిన పరికరాలన్నీ సిద్ధంగా వుంచమని చెప్పింది. "సుగుణా - కాస్త నొప్పిగా వుంటుంది. ఓర్చుకోవాలి" అంటూ గ్లోవ్స్ తొడుక్కుంటున్న వాణీని చూసి "అసలు నాకేమైంది డాక్టర్ గారూ" అని బావురుమంది సుగుణ.

"నీకేమైందో తర్వాత చెప్తా. ముందు బాధ తగ్గించనీ. మానం దగ్గర నీకు నీరు చేరింది. బాగా వాచిపోయినట్లుంది గదా - సూది వేసి నీరు తీస్తాను." నర్సులు సుగుణ కాళ్ళూ, చేతులూ కదలకుండా గట్టిగా పట్టుకున్నారు. సుగుణ గొడ్డులా అరుస్తోంది. తనలా అరుస్తున్నాననే స్పృహ పోగొట్టేంత బాధ. పది నిమిషాలు నరకయాతన అనుభవించాక సుగుణ బాధ తగ్గింది. శరీరం తేలికపడింది.

వాణీ ఆమెకొచ్చిన సమస్య గురించి చెప్పి "మందులిస్తానుగానీ మళ్ళీ ఇలా అవదని గ్యారంటీ లేదు. బిడ్డ బతకడం కూడా అనుమానమే. నా సలహా ఏమిటంటే నువ్విప్పుడే కడుపుతీయించుకుంటే మంచిది. ఏ ఏడో నెల్లోనో ప్రాణం మీదికి వచ్చేదాక ఆ బాధపడి - అప్పుడు బిడ్డ దక్కకపోతే మరింత బాధపడీ - అంత రిస్కు ఎందుకు? అబార్షన్ చేయించుకుంటే రెండు రోజుల్లో మామూలవుతావు."

సుగుణ భయంతో షాక్‌తో దిమ్మెర పోయింది.

అబార్షన్ అన్న మాటకే ఆమె తట్టుకోలేకపోయింది.

కానీ మళ్ళీ తనకీ వాపూ, బాధా, ఈ నీరు తియ్యడానికి సూదెయ్యడం ఇవి తప్పవనుకుంటే ఒణుకొస్తోంది.

చూస్తూ, చూస్తూ అబార్షన్ చేయించుకొని - అసలు అత్తకు తెలిస్తే ఏమంటుంది. గొడ్డుమోతని వాళ్ళు అనే మాటలు భరించలేక ఎన్నో పూజలు చేసి ఈ కడుపు తెచ్చుకొంది.

ఎట్టాగో ఒక బిడ్డను కని వాళ్ళ ముఖాన పడేస్తే తనకే నిందా వుండదు. కానీ డాక్టరేమో కడుపు తీయించుకోవాలంటుంది.

అబార్షన్ అన్న ఆలోచనకే గుండె దడదడ లాడి కళ్ళు తిరుగుతున్నట్లయింది. సుగుణకు "మా వాళ్ళతో చెప్పి వస్తా" నని చెప్పి మందులు తీసుకుంది.

తన పరిస్థితి ఉన్నదున్నట్లు అత్తతో చెప్పడానికి కూడా భయపడింది.

"రక్తపోటు ఎక్కువగా వుందంట. ఉప్పు కారం తగ్గించి తినమన్నారు. మందులు వాడమన్నారు" అని చెప్పింది.

"మా కాలంలో మేం యీ సుతారాలు ఎరగం. బిడ్డను కనబోయే దాక ఒళ్ళొంచి పని చేసుకునే వాళ్ళం. ఇపుడు బిడ్డ కడుపులో పడ్డకాడ్నించీ మంచం దిగరాయె" అంది సుగుణ అత్త మాలచ్చమ్మ.

ఆ ధోరణి చూసిన సుగుణకు అబార్షన్ మాట ఎత్తబుద్ధి కాలేదు.

మందులు వాడుకుంటున్నాగా - తగ్గిపోద్దిలే అని మాట్లాడకుండా వూరుకుంది. ఇరవై రోజుల పాటు సుగుణ దాదాపు ఆ సంగతి మర్చిపోయేదాక ఏ బాధా లేదు. ఇరవయ్యొకటో రోజు మళ్ళీ నీరు చేరి బాధ మొదలయింది. సుగుణ కూచోలేక పోతోంది. నుంచోలేక పోతోంది. ఇక దాచిపెట్టి లాభం లేదని వున్న సంగతి అత్తకు చెప్పింది. ఐతే అబార్షన్ సంగతి మాత్రం చెప్పలేదు. డాక్టరుగారు ఈ సారి యిట్లా నీరొస్తే భర్తనూ, అత్తనూ తీసుకురమ్మన్నారని మాత్రం చెప్పింది. వాణీ దగ్గరకు తీసుకువెళ్తే ఆమె చెబుతుందిలే అనుకుంది.

ఒకవైపు అత్తా, భర్తా యేమంటారో, ఎంత గొడవ చేస్తారోనని భయం, మరోవైపు తన గర్భం నిలబడితే బాగుండుననే కోరికా ఆమెను అతలాకుతలం చేస్తున్నాయి.

"దేవుడా - ఈకడుపును నిలబెట్టు, నేను చచ్చి పోయినా సరే ఆ బిడ్డను భూమ్మీద పడెయ్యి" అని దేవుడికి దణ్ణం పెట్టుకుంది.

ఆస్పత్రికి వెళ్ళబోతూ ఎంత ఓపిక లేకపోయినా పసుపు గుడ్డకు రెండు రూపాయల బిళ్ళలు నాలుగు కట్టి

"నా బిడ్డ బతికి బట్ట కడితే యింతకు వందరెట్లు నీ హుండీలో వేస్తాను స్వామీ" అని వేంకటేశ్వర స్వామికి మొక్కింది.

ఆస్పత్రిలో తాననుభవించబోయే బాధా -

ఆ బాధనుండి బయట పడడానికి డాక్టరు చెప్పిన పరిష్కారం - రెండూ ఆమెను ఒకే రకంగా జడిపిస్తున్నాయి.

ఆ రెండిలో దేన్ని భరించటానికీ ఆమె శరీరం గానీ, మనసుగానీ సిద్ధంకాలేక

పోతోంది.

వాణీ చెప్పింది విని మాలచ్చమ్మ గుండెలు బాదుకుంది.

"అయ్యో - డాక్టరమ్మవి పెద్ద పేణాన్నీ, చిన్న పేణాన్నీ నిలబెట్టవలసిన దానివీ, నువ్వే అట్టాగంటే ఎట్టాగమ్మా" అని నిష్ఠూరమాడింది.

వాణి ముందు సుగుణకు నీరు పిండేసి వచ్చింది. అరగంట సేపు తల్లీకొడుకులకు సుగుణకు వచ్చిన ప్రమాదం గురించి వివరంగా చెప్పినా యిద్దరూ మానుల్లా నిలబడ్డారు తప్పితే మాట్లాడలేదు.

"మాట్లాడరేం" అని గద్దించినా మొద్దుల్లా నిలబడ్డారు తప్పితే పెదవి విప్పలా - వాణీకే విసుగుపుట్టి లేచి సుగుణ దగ్గరకు వెళ్ళింది.

"ఏంటి? మీవాళ్ళేం మాట్లాడడంలేదు. నువ్వన్నా చెప్పు, ఎబార్షన్ చేయించు కుంటానంటే యిక్కడే వుండిపో - రేపు ఉదయాన్నే చేసేస్తాను."

సుగుణ నిశ్శబ్దంగా కళ్ళనీళ్ళు కారుస్తూ కూచుంది. ఐదునిమిషాల తర్వాత వాణీ ఓపిక నశించి

"ఏంటీ - ఏదో ఒకటి తేల్చి చెప్పు, ఎబార్షన్ చేయించుకుంటావా? లేదా?"

సుగుణ చేయించుకోనన్నట్టు తల అడ్డంగా వూపింది.

"ఎందుకని ?"

"బిడ్డ కావాలి"

"బిడ్డ బతకదు. నువ్వు చచ్చిపోయే అవకాశం కూడా వుంది."

వాణీ కోపం నిగ్రహించుకోలేక కటువుగానే అంది.

"ఏమో - ఇద్దరం బతుకుతామేమో" బలహీనంగా అంది సుగుణ.

అంత బలహీనపు గొంతులోనూ ఆశ బలంగానే ధ్వనించింది.

"కానీ ఈ హింస - ఇదెట్లా భరిస్తావు?"

"తప్పేదేముంది?" - పదినిమిషాలక్రితం తను పెట్టిన కేకలు తన చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నా వాటిని బలవంతంగా నెట్టేసి అంది.

వాణీ చేసేది లేక వెళ్ళి తన పనిలో పడింది.

పని చేస్తుందే గాని సుగుణ విషయం మనసులోంచి పోవడం లేదు.

ప్రాణాన్ని లెక్క చెయ్యకుండా, దుర్భరమైన బాధను లెక్కచెయ్యకుండా సుగుణ ఎందుకట్లా మొండిగా వుంది? ఆ మొండి తనానికి కారణం?

ఈ రోజు రాత్రి సుమతో ఈ కథంతా చెప్పి ఈ ప్రశ్నే వేసింది.

సుమ లాయరు. ఆడవాళ్ళకు అన్యాయం చేసే మగవాళ్ళకు ఉరిశిక్షకు తక్కువ శిక్ష వెయ్యకూడదనేంత తీవ్రవాది. అమె సహజంగానే సుగుణ స్థితికి, తల్లడిల్లింది. "ఆ మొండి తనానికి కారణం మాతృత్వం అనే ఆదర్శం. తల్లి కాకపోతే ఆమె తన జన్మ వృధా అనుకుంటుంది. తల్లి కాలేని ఆడది చచ్చినా బతికినా ఒకటే అనుకుంటోంది. కాబట్టి బిడ్డ కోసం చచ్చిపోతానంటోంది. ఇదొక టైపు వీరమరణం". అని సినికల్‌గా నవ్వింది.

"సుగుణను చూస్తే నువ్వు నవ్వలేవు" అంది వాణి చెల్లెలి తేలిక ధోరణికి నొచ్చుకుంటూ. "నేను ఏడవలేక నవ్వుతున్నా. ఈ ఆడవాళ్ళున్నారే వాళ్ళు - మొహరం పండుగ రోజో, వీరభద్రుని పండుగ రోజో తమను తాము కొరడాలతో కొట్టుకొని, కత్తులతో గాయపర్చుకుని మతావేశంతో చచ్చే భక్తులుంటారే - వాళ్ళలా ఆత్మహింసకు అలవాటు పడిపోయారు. ఎందుకీ హింస పడాలని ఆలోచించరు. అది తమ స్త్రీత్వ నిరూపణ అనుకుంటారు." అంది. ఆరోజు తర్వాత వాణీ తన బిజీలో సుగుణ విషయం మర్చిపోయింది.

మళ్ళీ విపరీతమైన బాధతో వచ్చింది సుగుణ. వాణీ కేసులన్నీ చూసి వార్డులో రౌండ్స్‌కి వెళ్ళ బోతుండగా వచ్చింది.

సుగుణని చూస్తూనే ఆమె పరిస్థితి అర్ధమైంది.

థియేటర్ రడీ చేయమని నర్సుతో చెప్పి తను రౌండ్సుకు వెళ్ళింది. వార్డులో రొటీన్ రౌండ్ అరగంటలో పూర్తి చేసుకుని థియేటర్‌కు వచ్చింది.

థియేటర్ బయట సుమ నిల్చుని వుంది.

"అరే - నువ్వు వస్తావన్న మాటే మార్చిపోయాను. ఒక్క పావుగంట-"

ఆ రోజు అక్కచెల్లెల్లిద్దరూ కలిసి ఒక పెళ్ళికి వెళ్ళాల్సివుంది. సుమ వాణీని పికప్ చేసుకోవడాన్కి వచ్చింది.

సుమ కూచోటానికి కుర్చీ తెమ్మని నర్సుతో చెప్తూ చేష్టలుడిగి తెల్లగా పాలిపోయిన ముఖంతో నుంచున్న సుమను చూసి

"ఏంటిది? అట్లా వున్నావేం? ఒంట్లో బాగాలేదా?" అని ఆదుర్దాగా చెయ్యిపట్టుకుంది.

"ఆమేనా సుగుణ?" సుమ గొంతు పూడ్చుకు పోయినట్టయింది.

వాణీకి అర్థమయింది. సుమది ఎంత సున్నితమైన మనసో ఆమెకు తెలుసు.

"నువ్వెందుకు చూశావు. థియేటర్‌లో ఆమె అలా వున్నపుడెందుకు చూసావు?"

"నువ్వు థియేటర్‌లో వున్నావని వెళ్తే - ఎదురుగా"

"సరే - నేను పని పూర్తి చేసుకొస్తా కూర్చో" వాణీ హడావుడిగా లోపలకు వెళ్ళింది.

పది నిమిషాలపాటు సుగుణ అరిచే అరుపులతో థియేటర్ మారుమోగింది.

వాణి నర్సుకి చెప్పాల్సినవి చెప్పి వచ్చేసింది.

సుమ మాట్లాడకుండా లేచి నడిచింది

*****

ఆ దృశ్యాన్ని సుమ మర్చిపోలేకుండా వుంది.

సుగుణను శారీరకంగా గొడ్డులా చేసి, ఆమె గొడ్డులా అరుస్తుంటే అరవనిచ్చి -

ఎందుకింత హింస? ఇక్కడ ఎవర్నీ దుర్మార్గులనలేం.

అంతా విచిత్రం - ఆనందం - గొప్ప - మురిపెం - గర్వం. వాటి వెనకాల యింత హింస. ఎవరు కారణం? సుగుణలే అంటుంది సుమ.

హింసకు అలవాటు పడటం, హింసను ఆమోదించటం వీటితోనే హింసకు ఎక్కడ లేని బలం వస్తుంది. అదిక తన మామూలు రూపంలో కనబడదు. పేరు కూడ మార్చుకుంటుంది. ఎట్లా ఈ ఆమోదాన్ని తుడిచెయ్యడం? సుమ బలవంతం తప్ప మార్గం లేదంటుంది. వాణీకి అట్లా అవతలివాళ్ళ అంగీకారం లేకుండా ఎబార్షన్ చెయ్యడం యిష్టంగా లేదు. ఇద్దరూ రోజూ రాత్రి ఈ విషయం మీద పోట్లాడుకుంటున్నారు.

కార్తీక పౌర్ణమి నాడు మొదలైన వాళ్ళ పోట్లాట మార్గశిర మాసపు పౌర్ణమి నాటికి కూడా తెగలేదు.

చివరకి వాణీయే సుమ దారిలోకి వచ్చింది.

ఆ మాట అన్నదో లేదో హాస్పటల్ నుంచి ఫోను. ఎమర్జెన్సీ సిజేరియన్ కేసు వుంది రమ్మని. ఉదయం డెలివరీ కోసం చేరినామెకు పిండం అడ్డం తిరిగిందట.

వాణీ వెళ్తుంటే సుమ తనూ తోడూ వస్తానంది.

"నువ్వెందుకు తల్లీ - అక్కడ ఏ ఆడది కాస్త నొప్పి ఓర్చలేక అరచినా నువ్వు భరించలేవు. ఇక ఆడాళ్ళు పెళ్ళి చేసుకోకూడదనీ, పిల్లల్ని కనకూడదనీ, దానికి చట్టాలనీ బుర్ర పాడుచేసుకుంటావు. వద్దులే - పడుకుని నిద్రపో" అన్నా సుమ వినలేదు.

ఇద్దరూ హాస్పిటల్ చేరారు. వాణీ ఆపరేషన్ చేసేందుకు సిద్ధమవుతోంది. సుమ ఆపరేషన్ థియేటర్ బయట వరండాలో నుంచుంది. ఆ వరండా దాటితే బైట చిన్న తోటలా వుంది. తోట చిన్నదే అయినా మంచి మొక్కలేం లేకపోయినా, వెన్నెట్లో ఎంతో అందంగా వుంది.

సుమ మెల్లిగా ఆ తోటలోకి నడిచి సిమెంట్ బెంచ్ మీద కూర్చుంది.

హాస్పిటల్ దగ్గర వెన్నెల కూడా దిగులుగా వున్నట్లనిపించింది సుమకు.

చలి కూడా ప్లజెంట్‌గా లేదు. భయపెడుతున్నట్లుగా వుంది.

వాణీ డీల్ చేస్తున్న కేసు తాలూకు మూలుగులు ఆ రాత్రి పేరుకున్న నిశ్శబ్దాన్ని చీలుస్తున్నాయి.

'ఈ కష్టం గట్టెక్కి పాప పుడుతుంది. ఫరవాలేదు. బాధ పడకుండా కుదరదు' - అని ఆ బాధ తన గుండెల్లోకెక్కకుండా జాగ్రత్త పడుతోంది సుమ.

శ్రీశ్రీ కవిత జ్ఞాపకం తెచ్చుకుంటోంది.

"ఇదిగో మాట ! ఈ ప్రపంచంలో ఇంకా ఎందరో అభాగ్యులున్నారు / పలకరించు వాళ్ళని చల్లగా / ధైర్యం చెప్పు వాళ్ళకు మెల్లిగా /

ఆసుపత్రి కిటికీల్లోంచి నీ / కిరణాలను జాలుగా పంపించి

వ్యాధిగ్రస్థుల పాలిపోయిన కపోలాలను / జాలిగా స్పృశించడం మరిచి పోకు"

ఆ గీతపు మెత్తదనంలో జాలిలో లీనమైపోయిన సుమను కీచుమంటూ ఆగిన జీపు చప్పుడు ఈ లోకంలోకి తీసుకొచ్చింది.

అందులోంచి గబగబా నలుగురు మనుషులు దిగారు. ఎమర్జెన్సీ రూం లోకి పరుగెత్తారు. అక్కడ కాస్త కలకలం - స్ట్రెచర్‌తో యింకొందరు వచ్చారు. జీపులోంచి రోగిన స్ట్రెచర్ మీదకు ఎక్కించి లోపలకు తీసుకొస్తున్నారు.

సుమ ఒకరకమైన కంగారుతో ఆందోళనతో దీనంగా చూస్తూ నిలబడింది.

ఆమె కళ్ళు వద్దనుకుంటూనే స్ట్రెచర్ మీదకు వెళ్ళాయి.

"సుగుణ" సుమ గుండెల్లో పెద్ద చప్పుడయింది. ఈమెకేమయింది -

ఆపరేషన్ పూర్తి చేసి వస్తున్న వాణీ సుగుణను చూస్తూనే థియేటర్‌లోకి తీసుకెళ్ళింది.

సుగుణ కడుపులో పెరిగే బిడ్డ ప్రాణం పోయింది.

సుగుణకి బి.పి. విపరీతంగా పెరిగింది. ఆమెను రక్షించేందుకు సర్వప్రయత్నాలతో సమాయత్తమయింది వాణి.

వాణీ హడావుడిగా పనిచేస్తున్నా ఆమె తలలో ప్రశ్నలు -

ఎంత తేలిగ్గా ఈ అపాయంనుండి బయటపడగల్గేది - ఎందుకిట్లా ప్రాణాలు తీసేసుకుందీ -

క్రమంగా ఆమెకు, సుగుణకు కూడా అర్థమవుతోంది.

ఈ హింసనుండి సుగుణకు విముక్తి తప్పదు.

ఎవరు కాదన్నా - సుగుణ ఎంత పెనుగులాడినా ఈ విముక్తి నుంచి ఆమెనెవరూ ఆపలేరు. చూస్తుండగానే సుగుణ శరీరం, మనసూ అన్ని హింసలకూ అతీతమైపోయాయి.

*(6.4.'97 ఆదివారం ఆంధ్రజ్యోతి)*